కవితా కౌముది

# అక్షరం

తుర్లపాటి రామానుజ రావు



ఒక్క గుండె కెన్ని ఊసులో
అనుభూతులన్నీ
ధమనులలో ప్రవహిస్తాయి.
అక్షరాలు చిగురించి
లతలుగా  వ్రేళ్ళ పై ప్రాకి
చుట్టుకుంటాయి.
ఒక్క ఊహ కెన్ని కొమ్మలో
ఆలోచనలన్నీ
పూపొదలవుతాయి
పదాలు గులాబి రేకులై
పెదవులపై  పరిమళిస్తాయి.
వాక్యాల తామరలు విరిసి
నా కళ్ళు
చెరువులవుతాయి.
నాకు నేనే
అర్థం అయ్యీ కాక
గుండ్రంగా తిరిగి తిరిగి
తామరాకుపై తేలి పోతాను
ఆకు చాటు
సూర్యకిరణం మెరిసి
పిల్ల తెమ్మెరలు
రగిల్చిన
వెదురు పొదల
వేణు గానం విని
సంభ్రమాల మనసు
పూచిన
మొగలి రేకుల
పాళీనై
కాగితంపై
నన్ను నేనే  లిఖించుకుంటాను.

★★★



# ఋణం సూర్యదేవర వేణుగోపాల్

నువ్వున్నప్పుడు ఎప్పుడూ యుద్ధమే
అలాఉండు ఇలాఉండు అంటున్నప్పుడు
కంపరమేసేది
ఏదడిగినా కాదన్నప్పుడు
నా కళ్ళు కన్నీటి కొలనులయ్యేవి

నీ ఆలోచనలు, ఆహార్యం
నాకెప్పుడూ ఛాందసమే
మిత్రుల ముందు నిన్ను
సంభోధించడానికి ఏదో జంకు
అవసరమైతే రెండేయండని
మాష్టారును ఎగద్రోసినప్పుడు
కసాయివిగా నా మెదడు పొరలలో
నిక్షిప్తమయ్యావు.....

లెక్కలే నీ ఊపిరి
మా కోర్కెలను కొండెక్కించే
నిన్ను లోభి గా నా మది చిత్రించింది

బ్రతికించడం కోసం
నువ్వు పడ్డ తపన చాకిరీ
నిన్ను ఒక అసమర్థుడిగా
నా మనసు తలపోసేది

చేయిపట్టుకొని బడికి తీసుకెళ్లినప్పుడు
జ్వరం నా కొస్తే గుళ్ళు ఆసుపత్రులు
దైన్యంతో నువ్వు ఆశ్రయించినప్పుడు
దయ్యం గాఉండే లెక్కలు
నేర్పినప్పుడు నువ్వే నా హీరో
నేను జ్ఞానినని భ్రమసినప్పటి నుండే
నువ్వు జీరోగా రూపాంతరం
చెందావు.......

కానీ.....
నువ్వు పోత పోసిన సువర్ణమని
ఆదిత్యునిలా కర్మనిష్టా గరిష్టుడవని
నా కోసం ఆహుతైన మైనపు ముద్దవని
నేను తండ్రినైయ్యాక జ్ఞానోదయమైంది

ఇరవైకే వ్యసనపీడితుడైన కొడుకు
నీ పెంపకపు స్వచ్ఛమైన మాధుర్యాన్ని
రుచిచూపించాడు.......

నాలాగా దేనికి దేబిరించకూడదన్న
పిచ్చి ప్రేమ నాకు పుత్ర శోకాన్ని
మిగిల్చేలా ఉంది....

మీ ప్రేమ బాధ్యతలే
నా పిచ్చి ఆశలను త్రుంచి
అందలం ఎక్కించాయని
నేటికి తెలిసింది.
నా అహం పొరలు అదృశ్యమైన వేళ
హిమాలయాలకన్నా మీరే ఉన్నతంగా
గోచరించారు.....
అజ్ఞానంతో అడుగడుగున
మిమ్మల్ని గాయపర్చినందుకు
నా మనసే యముడై నాకు నరకాన్ని
రుచిచూపిస్తోంది......

మీ నిష్క్రమణ తో
మీ ఔన్నత్యం స్ఫురించి
పశ్చాత్తాపం తో తడిసి ముద్దవుతున్నా......
నన్ను క్షమించు నాన్నా....
మళ్ళీ జన్మంటే నీ కొడుకుగా పుడతా
మీ ఋణం తీర్చుకుంటా...!!

★★★

# నా కవిత్వం

భమిడిపాటి స్వరాజ్య నాగరాజా రావు

సరళత్వంతో స్నేహించేసే పదాలు నావి,
సున్నితత్వంతో ముడిపడిఉండే భావాలు నావి.
నిజాలతో నిండిఉండే కవితలు నావి,
నిర్మోహమాటాన్ని నినదించే రాతలు నావి.
కలలు కవ్వించినా, కలతలు ఏడ్పించినా
వాటిని సాదరంగా ఆదరించి
కవిత్వంగా మలిచే తత్త్వం నాది.
నిత్యసత్యాలనే నమ్ముకొనే కవిత్వం నాది.
ప్రేమ నన్ను ప్రేరేపించినా,
ఆవేదన నాపై అసంతృప్తిని ప్రయోగించినా
వాటి ఆగ్రహాన్ని గ్రహించి,
వాటిని నిగ్రహంతో నిరోధించి
కవిత్వంలో వాటిని ప్రయోగించే
సహజత్వం నాది.
సహనంతో స్పందించే సుగుణత్వం నాది

★★★



# కన్నీటిధార

వారాల ఆనంద్

నాకు కొంచెం నిద్ర పోవాలనుంది
శరీరాన్ని భూమికి సమాంతరంగా చాపలా పరిచి
దేహం లోని ధమనుల్నిండా గాలి నింపుకుని
కొంచెం విశ్రమించాలని వుంది!
పగలూ రేయీ
పరుగు పరుగున పాకులాడి
కావలసిందేదో దొరకనితనంతో చేష్టలుడిగిన శరీరాన్ని
మూసిన  కనురెప్పల సాక్షిగా
చీకటి దారాలతో బంధించాలని వుంది!
ఎండో వానో... ఉక్కపోతో ఉన్నాదమో
తెలియందేదో తెల్లగోలు కావాలనో -
గానుగలా తెగ తిరిగి
వేడెక్కిన తలకు వూదు పూసేసో
అరికాళ్ళకు ఆముదం రాసో
నాక్కొంచెం చల్ల బడాలనుంది!
అలసట ముడి విప్పి కొంచెం తెలిపిన బడాలునుంది!
దేహానిదేముంది కన్నంటుకుంటే చాలు
అలసటేమిటి అన్నీ
మంచు ముక్కల్లా కరిగిపోతాయి
దూదిపింజల్లా ఎగిరిపోతాయి!
కానీ మనసే
అన్నినదుల్నీ తనలో ఇముడ్చుకున్న సముద్రంలా
అల్ల కల్లోలంగావుంది
కవ్వ మేదో చిలుకుతున్నట్టు
రాత్రీ పగలూ నిద్రా మెలకువా
అన్ని స్థితుల్లో
ఛిద్రం ఛిద్రమవుతున్నది!
తుఫానులా కన్నీటి ధార కురిసి
ఎక్కిళ్ళు నిలిస్తేనే
మనసు స్వచ్ఛమవుతుంది
నేనూ స్పష్టమవుతాను!!

★★★

# నేను - నువ్వు

లక్ష్మీ విజయ

నేను కవిని
కలత నిదురని
కాలరాత్రిని !
నువ్వు చెలివి
కఠిన శిలవి
కలలఝురివి
★★★★★★
నేను మదిని
ఎదకి తడిని
కన్నీటినదిని!
నువ్వు చెరవి
మనసు పొరవి
కనుకొలను నీరవానివి
★★★★★★★
నేను పుడమి
నువ్వు చినుకుచుక్క
నేను నిశిని
నువ్వు వెలుగురేఖ
నేను గిరిని
నువ్వు పచ్చనిమొక్క
నేను పక్కిని
నువ్వు నాకు రెక్క!
★★★★★★★★★★
నీవో నీలిమేఘం
నేను కూనిరాగం
నీవో గాలిపటం
నేను మొండిఘటం
★★★★★★★★★

నువ్వు విడిచిపోతావ్
నేను వెతుక్కుంటా
నువ్వు మరచిపోతావ్
నేను తలచుకుంటా
నువ్వు విరిచిపోతావ్
నేను అతుక్కుంటా
నువ్వు కలచిపోతావ్
నేను కలుపుకుంటా

నువ్వు ఎగురుతుంటావ్
నేను అందుకుంటా
నువ్వు ఒదిగిపోతావ్
నేను పొదువుకుంటా
నువ్వు తప్పుకోలేవ్
నేనిన్ను గెలుచుకుంటా

★★★★★
నువ్వు చెలివి
కఠిన శిలవి
కలలఝురివి

నేను కవిని
కలత నిదురని
కాళరాత్రిని

★★★



# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

చూచుచుందును పూవుల సొగసు వంక
జాలువారెడు నీహారజలము వంక
చూచుచుందును వెన్నెల సొబగు వంక
గాలినూగెడు పచ్చని చేల వంక

తారలను తాకు దివ్యసౌధముల వంక
అమిత వేగాన జను వాహనముల వంక
ప్రమదమును గొల్పు చిరుకుటీరముల వంక
నెమ్మదిగ సాగు సెలయేటి నీటి వంక

తలచుచుందును మనిషి సాధనల గూర్చి
ప్రకృతినొప్పారు సహజ శోభలను గూర్చి
ఎంతకాలమో యివియుండునిచట యంచు
చరమగామిని నేనుండజాలననుచు

కనులముందరనివియేవి కరగిపోవు
కరగునది నాదు జీవితకాలమొకటె
నిత్యసౌందర్యమిచ్చటే నిలచి యుండు
కాంచుటెట్టులెల్లెడల చీకట్లు కమ్మ

గడచినబ్రతుకు తోచె యుగమ్ము వోలె
మిగిలిన బ్రతుకు తోచు నిమేషమట్లు
నిమిషములలోన యుగముల నింపుకొందు
శాశ్వతములుగ మలచెద క్షణములన్ని


చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS